

# కంచం పొత్తు కందుల మాలకొండరావుతోటే....

ఆకాశంలో పిట్టని చూశా. ఆదివారంనాడు మా మాబ్బాషా కొట్టే మావుసం ముక్కల్లో నిగనిగా మెరిసే మెరుపుని చూశా. రాంకోటారెడ్డోళ్ల గడ్డివామిలో మా నల్లకోడిపెట్ట దూరి సీక్రేటుగా పెట్టే తెలతెల్లని గుడ్లు చూశా. ఆరునెలలకు ఒక మారన్నా మా అమ్మ తెగించి రెండు మూడు రూపాయల దాకా దుబారా పెట్టడం చూశా. మా నాయన పొద్దున్నే లేవడం చూశా. ఆఖరికి నాకు లెక్కల్లో పాతికకు పదిహేను దాటడం కూడా చూసేశా.

కానీ... మా మురళీగాడు అన్నం తినే సీనును మాత్రం ఇప్పటి దాకా చూడలాక పోయినానబ్బా.

మద్యానం పూట ఎప్పుడు వాళ్లింటికి వెళ్లినా సరే 'అన్నానికి కూచొని ఉండాడు. ఉండు' అని కేకేసేది వాళ్ల బామ్మ.

అవునా అని మనం తొంగి చూడబోతామా? అవుపిస్తే గదా. ముందర మద్యింటి తలుపు అడ్డం. ఆ తర్వాత ఎనకింటి తలుపు అడ్డం. ఆ తర్వాత వాళ్ల బామ్మ అడ్డం. ఆమె

ఎనక యాణ్ణో కూచొని ఎవురి కంటా పడకుండా తింటా ఉంటాడు వాడు.

అదేమిరా అనంటే దిష్టి తగలకుండా అంట.

'నరుల దిష్టి సోకితే నాపరాళ్లే పగలతాయి. వీడు నవనవలాడే బిడ్డ. అన్నం కాడ ఎవురైనా చూసి ఇంత తింటా ఉన్నాడు, అంత తింటా ఉన్నాడు అని అనుకుంటే యింకేమైనా ఉందా?' అని వాళ్ల బామ్మ వాణ్ణి నలుగురిలో తిననియ్యదంట.

'ఏమిరా ఈ ఖర్మ' అని అనిపించింది నాకు.

మామూలుగా మా యిళ్లల్లో ఏందంటే అన్నాలకి కూచున్నాక ఎవురైనా వొచ్చారనుకో, మా నాయనకు లేచెళ్లి వాళ్లని పలకరియ్యాలంటే బద్దకం గదా, అందుకని వాళ్లనే యింట్లోకి రమ్మనమని  పిలిచేవాడు.

వాళ్లు ఎండమొకాలతో, మట్టికాళ్లతో వచ్చి లోపలకి కూచుంటే, వాళ్లతో మాట్లాడతానే అన్నం తినేవాడు. అంతటితో ఊరుకోకుండా, ఎండుచేపో అట్టో చేసుకుంటాము గదా వాసనకి, తుంచి తినమని పెట్టేవాడు. ఇంక మేమైతే కంచాలు తీసుకొని కుదురుగ్గా ఉండకుండా ఇల్లంతా తిరగతా ఉంటాము. రాత్రి పూటైతే చల్లగా ఉంటుందనీ, వీది గడప మీద కూచుని వచ్చే పొయ్యే వాళ్లని చూస్తా తింటాము.

మురళీగాడికి ఆ ప్రాప్తం లా.

'మామా. నువ్వు అన్నం తింటా ఉంటే చూసే కోరిక తీరకుండానే చచ్చిపోతానే మోనని బయంగా ఉంది మామా' అన్నాను నేను, వాడితో ఒకసారి.

'అయ్యేం మాటలురా. స్వామిహోటల్లో మనం ఇడ్లీలు ఎదురెదురుగ్గా కూచొని తింటాము గదరా. అప్పుడు చూస్తావు గదరా' అన్నాడు వాడు.

'ఇడ్లీలు తినడం వేరు. అన్నం తినడం వేరు గదరా. అసలకి అంతంత సేపు ఏమేమి తింటుంటావురా నువ్వు' అన్నాను వాడితో.

'పెట్టుకునేది ఎక్కువ తినేది తక్కువరా నేను. ముందర ఒక ఆవకాయగానీ, ఒక పచ్చడిగానీ ఉంటుంది. అదయినాక ఒక తాలింపు ఉంటుంది. తర్వాత ఒక తియ్యగూర. రొంత పప్పు. రొంత సాంబారు. చివరకు ముందర నాలుగు గెరిటెల రసం. చివరలో మజ్జిగగానీ, పెరుగుగానీ... లేచే ముందర ఒక అరటి పండుగానీ సగం కోసి పెట్టిన జాంకాయ గానీ. ఇదిరా సింపులుగా మా లిస్టు' అన్నాడు వాడు.

నాకు కడుపు కాలిపోయింది అది వింటే.

'మావా. ఈ వాటాన యిప్పటి దాకా నేను తినుంటే ఈపాటికి దారాసింగు అమ్మామొగుడి లాగా తయారయ్యుండేవాణ్ణిరా. మా అమ్మ రెండు పూటలకి కలిపి ఒకే కూర చేసి ఇదే పచ్చడనుకో, ఇదే పప్పనుకో, ఇదే సాంబారనుకో, ఇదే మజ్జిగనుకో, ఇదే పరమాణ్ణం అనుకో... అని చెప్పే జగజ్జంత్రీ. మా అమ్మ చేసింది కాదని, ఇది ఏమి ఇలా చేసినావు అని ఒక్క ముక్క అడిగేదానికి మా నాయనకిగానీ, మాకుగానీ దమ్ములు లేవు. పెట్టింది తిని లేవడమే తప్ప అన్నపూర్ణా హోటలులో లాగా యింత లిస్టు మేమెప్పుడూ ఎరగం మామా' అన్నాను నేను.

'దాందేముందిరా. ఒకసారి మా యింటికి రారా. పెడతా' అన్నాడు వాడు.

'ఆ మాట అన్నావు అంతే చాలురా. మీ యింట్లో మంచినీళ్లిచ్చినా పెదాలికి అంటుకోకుండా తాగు అనేసి పదహారుసార్లు చెప్తారు గదరా, యింక అన్నం ఏం పెడతారురా' అన్నాను నేను.

వాడు నాలిక కరుచుకున్నాడు.

'సారీరా. మా తాతయ్యా బామ్మా అంతా పాతకాలం మనుషులు. మడీ గిడీ అంటా నన్నే సంపతా ఉంటారు. నిజమే రా. నువ్వు మా యింట్లో తినడం కష్టమేరా' అన్నాడు వాడు.

'అట్టాగే నువ్వు కూడా మా యింట్లో తినడం కష్టం గదరా. నువ్వు తింటా అన్నా బేపనోళ్ల పిల్లోడు మన యింట్లో ఎందుకు తింటాడు నీసు అని మా అమ్మ ముందరే అడ్డం కొట్టద్దిరా' అన్నాను నేను.

ఇద్దరం ఒక రకంగా మొకాలు పెట్టి నిలబడిపోయినాం.

అంతలోనే మురళీగాడు గంభీరంగా తయారయిపోయి మొకం ఎర్రంగా చేసుకొని-

'ఏనాటికైనా మా యింట్లో నువ్వూ మీ యింట్లో నేనూ ఎప్పుడు కావాలంటే అప్పుడు పడి మెక్కే రోజులు రావాలి రా. అప్పటి దాకా మనం ఎంత నిద్రొచ్చినా నిద్రపో వద్దురా. ఏదీ... ఎదురెదురుగ్గా నిలబడు... ఇప్పుడు నువ్వు క్రిష్ణ నేను రజనీకాంత్ ఇది అన్నదమ్ముల సవాలురా' అన్నాడు వాడు చేయి సాపతా.

నేను కూడా చేయి సాపినాను. సాపిన చేతులు సాపినట్టుగా ఎన్నాళ్లు గడిచినా మా సవాలు తీరలా.

సరే, మురళీవాళ్లంటే ఆచారం మనుషులు... టయం పట్టద్ది, కేతిరెడ్డి శ్రీదరోళ్లు రెడ్లు గదా, వాళ్లకు పట్టింపులు ఉండవు, పైగా నెల్లూరు రెడ్ల యిళ్లల్లో చారు బాగా కాస్తారని పేరు, ఒక్కసారైనా తినక పోతామా అని కలలు కంటా ఉంటే ... యాడా? వాళ్ల నానమ్మ పడనిస్తేగా.

మద్యానాలప్పుడు వాళ్లింటికి పోతే, గేటు కాణ్ణే ఆపేసి 'పోపో... మా బాబు అన్నం తింటా ఉన్నాడు గానీ మళ్లీరా.. పో' అని తరిమి పార్నూకేది.

'మావా. మురళీవాళ్ల బామ్మే నయం రా. బయటన్నా కూచోపెడతా ఉంది. మీ నానమ్మ ఏకంగా గేటు బయటకే పంపిస్తా ఉంది' అన్నాను వాడితో కోపంగా.

'ఏందిరో... మా నానమ్మ మీద కోపం నా మీద చూపెడతా ఉన్నావో' అన్నాడు వాడు.

'లేకుంటే ఏందిరా. ఒంటేలు మాత్రం నలుగురి ముందర చెడ్డీ ఎత్తి అందరికీ అవు పించేలా పొయ్యొచ్చు. అన్నం మాత్రం నలుగురి కంట పడకుండా సీక్రెటుగా తినాల. యిదేమీ రూలురా' అన్నాను వాడితో.

'ఏందోలేరా. పెద్దోళ్లు. వదిలెయ్. నేను పెద్దయినాక మా యింట్లో డెయిలీ తిందువులే రా ' అన్నాడు వాడు.

'అంతేలేరా. కరెక్టే లేరా' అన్నాను నేను, యింకేమి అనాలో తెలియక.

కాండూరి మురళీగాడు, కేతిరెడ్డి శ్రీదరుగాడు ఈ వాటాన ఉన్నారే, ఇంక కందుల మాలకొండరావుగాడు ఏ వాటాన ఉంటాడో గదా, వాడి మానానికి పోయి మనం మానం

పోంగొట్టుకునే బదులు గమ్మునుండడం మేలు అని అనుకుంటా ఉంటే వాడే ఒక రోజు నాకాడికి వొచ్చి 'ఒరే కదీరా.. రేపు మా యింటికి బోజనానికి రారా. కనుం పండగ' అన్నాడు.

'కనుం అంటే ఏందిరా?' అన్నాను నేను.

'గొడ్ల పండగరా. గొడ్ల కొమ్ములకి రంగులు కొట్టి చేసుకుంటామే ఆ పండగ' అన్నాడు వాడు అమాయకంగా.

'అమ్మాబడవా ఆకరికి నన్ను గొడ్లలో కలిపినావు గదరా నాయాలా' అన్నాను మండి.

'చచ.. మేము సంక్రాంతికి మటను చెయ్యమురా. కనుం పండక్కి చేస్తాము. నీకు మటనంటే యిష్టం గదా. అందుకని పిలవడం. మా అమ్మ కూడా చెప్పింది రమ్మనమని. రేపు రారా' అన్నాడు వాడు.

'నువ్వు అంత యిదిగా పిలస్తా ఉన్నావు కాబట్టి వస్తాను రా' అనేసి మరసటిరోజు వాళ్లింటికి వెళ్లాను.

వాళ్ల అమ్మా నాయన నన్ను పిలిచి, మాలకొండరావు పక్కన కూచోబెట్టి, ఇస్తారాకు ఏసి తినీ తినీ కళ్లమ్మట నీళ్లొచ్చినంత సేపు పెట్టినారు తిండి.

ఆకరున ఆకొక్క కూడా చేతిలో పెడతా ఉంటే తీసుకొని మాలకొండరావుతో అన్నాను 'కందులుగా. కడుపు నిండి పొయ్యిందిరా ఈ దెబ్బతో. నువ్వు కూడా మా యింటికి రావాలిరా. మేము చేసుకునేది రెండు పండగలే అయినా రంజాను బక్రీదు బాగా చేసుకుంటామురా. నువ్వు మస్టుగా రావాలిరా' అన్నాను.

'బలేవాడివి రా. వస్తాను రా' అన్నాడు వాడు.

అప్పటి నుంచి నాకూ మాలకొండరావుగాడికీ కంచం పొత్తు కలిసింది. కనుం, దసరా పండక్కి వాడు, రంజాను బక్రీదుకి నేను కంచాలూ ముక్కలూ పంచుకుంటా ఉన్నాం.

ఇది చూసి చూసి శ్రీదరుగాడికి ఏమని అనిపించిందో ఏమో ఒక సంక్రాంతి పండక్కి ఒక పాలితిను కవరు నిండా మనుబూలూ, అరిసెలు పెట్టుకొని వచ్చి 'కదీరా. తీసుకోరా. మా నానమ్మ యిచ్చిందిరా' అని నా చేతిలో పెట్టినాడు.

నాకు తెలుసు, అయి వాళ్ల నానమ్మ యిచ్చుండదనీ, యీడే న్యాగ్గా ఎవరికంటా పడకుండా తెచ్చుంటాడనీ. కానీ ఆ మాట పైకి అని వాణ్ణి పలుచన చేయడం ఎందుకని 'అబ్బా. బలే ద్యాంక్సురా. మా యింట్లో ఇస్తాను రా'అన్నాను తీసుకుంటా.

వాడు కాసేపు అట్టా యిట్టా చూసి 'అవునురా... మీ యిళ్లల్లో పలావు బలే చేస్తారంట గదరా' అన్నాడు.

'చేస్తార్రా. మా సాయెబులగ్గనక కొబ్బరి తోటలు ఉంటే మావుసం కూరల్లో మసాలాల కోసమే వాటిని అమ్మకనూకతార్రా. అంత ఏస్తారు మసాలాలు. మీ యిళ్లల్లో తక్కవ గదా. అందుకని మా యిళ్లల్లో బాగుంటుందిరా పలావు. రంజాను పండక్కి నిన్ను పిలిస్తే వస్తావో రావో మీ నానమ్మ పంపద్దో లేదోనని గానీ నువ్వు వస్తే నాకు బలే యిది గదరా' అన్నాను నేను.

ఆ మరుసటి సంవచ్చరం రంజాను పండక్కి కేతిరెడ్డి శ్రీదరురెడ్డిగాడు కూడా వచ్చి

మా యింట్లో పలావు తినేసి పోయినాడు ముక్కు తుడుచుకుంటా మూతి తుడుచుకుంటా.

ఇట్టా పండగలకీ పబ్బాలకీ మేం ముగ్గురం తయారయిపోతా ఉండటం చూసి 'ఒరే... మీ యింట్లో చేసే సేమ్యాలన్నా నాకు పెడతా ఉండరా.. నీసు లేని వస్తువ అదొక్కటే గదరా' అన్నాడు మురళీగాడు. అలావాడు కూడా కలిసినాడు మాతో పండగలకి. అదీగాక అప్పుడప్పుడు సుఖీలు, దద్దోజనాలు కూడా మా కోసం తీసుకురావడం మొదలుబెట్టి నాడు.

బండి యిట్టా సాగతా ఉందిగానీ శ్రీదరువాళ్లింట్లో, మురళీ వాళ్లింట్లో కంప్లీటుగా బోజనం చెయ్యాలనే నా కోరిక మాత్రం తీరలా.

చాలా రోజుల తర్వాత, అంటే మేము ఇంటర్మీడియట్‌కి వొచ్చినాక శ్రీదరువాళ్ల అక్క పెళ్లి జరగతా ఉంటే ఫస్టు టైము వాళ్లింట్లో బోజనం చేసి రెడ్ల చారు టేస్టు చూసినాను. అంటే అప్పటికి మనకు వాళ్ల యింట్లో బోజనం చేసే గౌరవం వచ్చిందన్న మాట. అందు కనే వాళ్లింట్లో ఇప్పటికి చాలాసార్లు తింటా ఉన్నా ఆ ఫస్టుటైము బోజనం మాత్రం మర్చి పోలా.

ఇంక మురళీగాడి విషయానికి వస్తే, మా చదువులైపోయినాక హైదరాబాదులో వాడి పెళ్లి జరగతా ఉంటే ఫస్టు టైము వాడి ఇంటి బోజనంగా ఆ పెళ్లి విందు తినడమే. మళ్లా లా. ఇంట్లోనూ లా.

ఇంక మాలకొండరావు సంగతి అంటారా.

నేను వాళ్లింట్లో బలిజవాణ్ణి.

వాడు మా యింట్లో సాయెబు.

మా కంచం పొత్తు అట్టాగే సాగతా ఉంది సందు దొరికినప్పుడల్లా.

■